సాక్షి నంద్యాల
మంగళవారం, 27, ఫిబ్రవరి, 2024



గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: గో సంరక్షణనిధి పథకానికి సోమవారం గుంటూరుకు చెందిన అన్నపురెడ్డి శేషిరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్య వేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు.



వైభవంగా వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వా మి వార్లకు వెండి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. సహస్రదీపార్చన అనంతరం వెండిరథంపై ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



ఉమామహేశ్వరుడికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమా మహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి క్షేత్ర పరిధిలో ఊరేగింపు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మినీ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీన జరిగే మినీ జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్విని యోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపు ణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) జిల్లా అధికారి ప్రతాపరెడ్డి అన్నారు. ఈ జాబ్‌మేళాకు గరుడ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్, అవివోమ్ ఇం డియా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, గ్రీన్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు 5వ తరగతి, పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలని, విద్య, వయస్సు ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకో వాలన్నారు. మరింత సమాచారానికి 9440224291ను సంప్రదించాలన్నారు.

షూటింగ్ బాల్ జాతీయ జట్టు మేనేజర్‌గా పరుశరాముడు



నంద్యాల(న్యూటౌన్): వరల్డ్ కప్ పోటీల్లో పాల్గొనే ఇండియన్ షూటింగ్ బాల్ జట్టు మేనే జర్‌గా పరుశరాముడిని ఎంపిక చేసినట్లు షూటిం గ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జన రల్ రవీంద్రసింగ్ తోమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్చినెల 2, 3 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీలు జరుగనున్నాయి. ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శిగా కొనసాగుతున్న పరుశరాముడిని మహిళా జట్టు మేనేజర్‌గా ఎంపిక చేశారు. గతంలో కూడా ఈయన ఏషియన్ పోటీల్లో భారత జట్టు కోచ్‌గా వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు రెండు ప్రాజెక్ట్‌లు ఎంపిక



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు


నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రద ర్శనకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైన ట్లు జిల్లా సైన్స్ అధికారి కె.సుందర్‌రావు తెలి పారు. సోమవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈఎండీపీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి దశలో 337 ప్రాజెక్టులు నమోదు చేసుకోగా వాటిలో 12 ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రెండో దశలో నిర్వహించిన ప్రదర్శనలో జిల్లాస్థాయి పరి శీలకులు, ఈఎండీపీ మేనేజర్ గోపాల్ పర్యవేక్ష ణలో రెండు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. నందివర్గం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నుం చి 'జాయ్ స్టిక్ వీల్‌చైర్' ప్రాజెక్ట్, శిరివెళ్ల కేజీబీవీ నుంచి 'వ్యర్థపదార్థాల్లో ఆర్థిక వనరులు' అనే ప్రాజెక్టులను మార్చి 7వ తేదీన అమరావతిలో జరిగే రాష్ట్ర పోటీల్లో ప్రదర్శించనున్నారు. విజేత లైన విద్యార్థులకు ఎస్ఎస్ఏ అధికారి లలితకు మారి, ఏఎంఓలు మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్వింటా వాము రూ.30 వేలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాము ధర రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం మార్కెట్‌కు వాము దాదాపు 1,449 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.532, గరిష్ట ధర రూ.30వేలు, సగటు ధర రూ.20,199 ప్రకారం లభించింది.

'పవర్' ఫుల్ రాయితీ

- బడుగు, బలహీనవర్గాల వారికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,97,995 ఉచిత విద్యుత్ సర్వీస్‌లు
- ప్రతి నెలా 11.52 మిలియన్ యూనిట్ల వినియోగం
- ప్రభుత్వంపై ఏడాదికి రూ.68.4 కోట్ల భారం
- ధోబీఘాట్లకు 100 శాతం విద్యుత్ రాయితీ
- గోల్డ్‌స్మిత్‌లకు 100, ల్యాండ్రీలకు 150, ఎంబీసీలకు 100, నాయీ బ్రాహ్మణులకు 150 యూనిట్ల విద్యుత్ ఉచితం



కర్నూలు(అగ్రికల్చర్): పేదలైన బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ కూడా అందిస్తోంది. టీడీపీ హయాం లో ఎస్సీ, ఎస్టీలకు నెలకు 50 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ ఉండేది. తర్వాత దానిని 100 యూనిట్లకు పెంచారు. వైఎస్ఆర్‌సీపీ అధికారం లోకి వచ్చాక నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచి తంగా ఇస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు 1,75,067 లబ్ధిపొందుతు న్నాయి.

భారమైనా అండగా నిలుస్తూ..

బడుగు, బలహీన వర్గాలు, వృత్తి పనివారలకు ఉచిత విద్యుత్ ఇస్తుండటంతో ప్రతి నెలా ప్రభు త్వంపై రూ.5.70 కోట్ల భారం పడుతోంది. ఈ వర్గాల సంక్షేమం లక్ష్యంగా భారమైనా ఏడాదికి రూ.68.4 కోట్లు భరిస్తోంది. ధోబీ ఘాట్లు, స్వర్ణకా రులు, చేనేతకారులు, ల్యాండ్రీషాపులు, అత్యంత వెనుకబడిన వారు (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్), నాయీ బ్రాహ్మణులు, ఎస్సీలు, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందుతోంది. పవర్‌లూమ్స్‌కు(మర మగ్గాలు) విద్యుత్ చార్జీల్లో 50 శాతం రాయితీ ఇస్తోంది. టీడీపీ హయాంలో వృత్తి పనివారలకు ఎటువంటి విద్యుత్ రాయితీలు లేవు. చేనేతకారు లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని జీవో ఇచ్చి.. చంద్రబాబు పాలన ఐదే ళ్లలో ఒక్క యూనిట్ కూడా ఉచితంగా ఇవ్వలేదు. ఏపీఎస్‌పీడీసీఎల్‌కు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోని, డోన్, కర్నూల్ రూరల్, కర్నూలు, నం ద్యాల, ఎమ్మిగనూరు డివిజన్‌లు ఉన్నాయి.

మీటరు తప్పనిసరి

ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచి తంగా విద్యుత్ ఇస్తున్నారు. అయితే ప్రతి కుటుంబం విధిగా మీటరు పెట్టుకోవాల్సి ఉంది. కొంత మంది ఉచిత విద్యుత్ కదా.. మీటర్లు ఎందుకు అంటూ నిర్లక్ష్యం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 200 యూని ట్ల వరకు ఉచితంగా గృహ అవసరా లకు విద్యుత్ వినియోగించవచ్చు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉచిత విద్యుత్‌కు అర్హులైన ఎస్సీ కుటుంబాలు 1,75,917 ఉండగా..1,59,823 కుటుంబాలు ఉచిత విద్యుత్ పొం దుతున్నాయి. ఈ కుటుం బాలు ప్రతి నెలా 1,14,02,375 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తు న్నాయి. ఎస్టీల్లో 18,749 కుటుంబాలు ఉచిత ఉచిత విద్యుత్ పొందేందుకు అర్హత పొందగా 15,244 కుటుంబాలు పొందుతున్నాయి. ఎస్సీ, ఎస్టీల్లో మొత్తంగా 1,75,067 కుటుం బాలు ఉచిత విద్యుత్ పొందు తున్నాయి. ఈ కుటుంబాలు ప్రతి నెలా 1,14,02,375 యూనిట్లు వినియోగి స్తుండటం విశేషం.

వృత్తులకు 'ఉచిత' వెలుగులు

వివిధ వృత్తుల్లో రాణించే వారికి కూడా ప్రభుత్వ ఉచిత విద్యుత్ ఇస్తోంది.

- ఆదోని, డోన్, నంద్యాల, ఎమ్మిగనూరు డివిజ న్‌లలో ఒక్కో ధోబీఘాట్ చొప్పున నాలుగింటికి ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. వీటికి పరిమితులు లేకుండా విద్యుత్‌ను వాడుకోవచ్చు.
- స్వర్ణకారులు (గోల్డ్‌స్మిత్‌లు)100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చు. అర్హత పొం దినవారు 165 మంది ఉండగా, ప్రస్తుతం149 మంది 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్నారు.
- రజక వృత్తిలో ఉండి ల్యాండ్రీ షాపులు నడుపు తున్న వారికి 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. అర్హత పొందిన వారు 162 మంది ఉండగా ప్రస్తుతం 150 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు.
- అత్యంత వెనుకబడిన వర్గాల(ఎంబీసీల)కు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తు న్నారు. 701 కుటుంబాలు అర్హత పొందగా.. ప్రస్తుతం 640 కుటుంబాలు నెలకు 31,778 యూనిట్ల విద్యుత్‌ను వాడుకుంటున్నాయి.
- పవర్ లూమ్స్‌కు ప్రభుత్వం విద్యుత్ వినియో గంలో 50 శాతం రాయితీ ఇస్తోంది. కర్నూలు నగరంలో ఆరు, నంద్యాలలో రెండు ప్రకారం మొత్తంగా 8 పవర్‌లూమ్స్‌కు 50 శాతం రాయితీ లభిస్తోంది. పవర్ లూమ్స్‌కు నెలకు 2,306 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు.

- నాయీ బ్రాహ్మణులకు 150 యూనిట్ల వరకు ఉ చిత విద్యుత్ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తోంది. వీరిలో బీపీఎల్‌కు దిగువనున్న కుటుంబాలు 1963 ఉండగా ప్రస్తుతం 1,880 కుటుంబాలు ఉచిత విద్యుత్ పొందుతున్నాయి. ఈ కుటుం బాలకు నెలకు 61,227 యూనిట్ల విద్యుత్ ఇస్తున్నారు.
- చేనేత వృత్తిలో రాణించే వారికి 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందే సదుపాయం ఉంది. 240 చేనేతకారులు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉచిత విద్యుత్ వినియోగిస్తున్నారు. మిగిలిన వారు తగిన రుజువులతో సంబంధిత విద్యుత్ అధికారు లను సంప్రదిస్తే వారికి కూడా ఉచిత విద్యుత్ ఇచ్చే అవకాశం ఉంది.

ఊరటనిస్తోంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తోంది. సీతమ్మ తండాలో 250 ఇళ్లు ఉన్నాయి. అన్ని కుటుంబాలు ఉచిత విద్యుత్‌ను విని యోగించుకుంటున్నాయి. తండా వాసులు 200 యూనిట్ల వరకే వినియోగిస్తున్నందున రూపాయి భారం పడటం లేదు. టీడీపీ హయాంలో 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను సక్రమంగా అమలు చేయలేదు. ప్రతి నెలా బిల్లు చెల్లించాల్సి వచ్చేది. వైఎ స్సార్‌సీపీ పాలనలో ఉచిత విద్యుత్ సదుపాయం గిరి జనులకు ఊరటనిస్తోంది. ప్రభుత్వానికి కృతజ్ఞత చెబుతున్నాం.

– లక్ష్మిరామ్‌నాయక్, సర్పంచ్, సీతమ్మ తండా, ప్యాపిలి మండలం, నంద్యాల జిల్లా

చాలా సంతోషం



గిరిజనులైన సుగాలీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం శుభపరిణామం. ఎల్లమ్మ తండాలో 150 కుటుం బాలు ఉన్నాయి. అన్ని కుటుంబాలకు ఈ సదుపాయం ఉంది. ప్రతి కుటుంబం 200 యూనిట్ల వరకే వినియోగిస్తోంది. ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించడం లేదు. టీడీపీ హయాంలో 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం ఉన్నప్పటికి నెలనెలా బిల్లులు కట్టించుకున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వం 100 యూనిట్ల నుంచి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించడం చాలా సంతోషంగా ఉంది.

– బాబునాయక్, ఎల్లమ్మ తండా, తుగ్గలి మండలం

అర్హులుంటే దరఖాస్తు చేసుకోవచ్చు



వృత్తి పనివారలు, బడుగు బల హీన వర్గాల అభ్యున్నతి లక్ష్యం గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత పరి మితి వరకు ఉచిత విద్యుత్ ఇ స్తోంది. ఎస్సీ, ఎస్టీలకు ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం ఉంది. ప్రతి కుటుంబం విధిగా మీటరు పెట్టుకోవాల్సి ఉంది. 200 యూని ట్లకు మించి వాడితే బిల్లు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఉచిత పొందే కనెక్షన్లు 1,97,995 ఉన్నాయి. వీరికి ప్రతి నెలా 11. 52 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఇస్తున్నాం. బీపీఎల్‌కు దిగువనున్న ఎస్సీ, ఎస్టీలు, ఎంబీసీలు, చేనేతకారులు ఉచిత విద్యుత్‌కు దర ఖాస్తు చేసుకోవచ్చు.

– ఉమాపతి, ఎస్ఈ

స్మార్ట్ స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, రైల్వే నోడల్ అధికారి శ్రీహర్ష తదితరులు

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి
- నంద్యాల రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు వర్చువల్‌గా ప్రారంభించిన పీఎం

నంద్యాల(సిటీ): అమృత్ భారత్ స్టేషన్ స్కీంకు ఎంపికై న నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఆధునిక మౌలిక సదుపా యాలు కల్పించి స్మార్ట్ స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నోడల్ అధికారి, రైల్వే డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఆర్. దయాల్ శ్రీహర్ష ఆధ్వర్యంలో నిర్వహించారు. నంద్యాల రైల్వే స్టేషన్‌ను మరో విమానాశ్రయం మార్చేందుకు రైల్వే శాఖ రూ.22.80కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గోమతి రైల్వేస్టేషన్ నుం చి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ పోచా మాట్లాడు తూ.. రానున్న కాలంలో నంద్యాల రైల్వే స్టేషన్ రూపు రేఖలు మారిపోతాయన్నారు. రైల్వే స్టేషన్ పునరు ద్ధరణలో భాగంగా ఫ్లోరింగ్, పార్కింగ్, అత్యాధునిక వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫాం మొత్తం రూఫింగ్, అదనపు ప్లాట్‌ఫాంలు తదితర మౌలిక మార్పులు చేయనున్నట్లు చెప్పారు. రైళ్లలో ఆధునిక సౌకర్యాలు, తగిన వేగం, స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, డిజిట లైజేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. నూనెపల్లెలో రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జ్, విజయ డెయిరీ వద్ద రోడ్డు క్రాసింగ్ పనులు మంజూరు కాగా ఈ పథకం కింద పూర్తవుతా యన్నారు. కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ అధికారుల సహకారం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ పనులన్నీ వేగంగా జరిగాయన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్ర మాలను తిలకించి విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అభిరుచి మధు, డాక్టర్ ఇంటి ఆది నారాయణ, మల్లికార్జున, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రంగ స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద విత రణ పథకానికి పలువురు భక్తులు రూ.2లక్షల విరాళాలను అందజేశారు. సోమవారం కడపకు చెందిన చిలకంపల్లె రామసుబ్బారెడ్డి రూ.2,02,232 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేశారు. అలాగే డోన్‌కు చెందిన కె.కేశవ రెడ్డి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఏఈవో ఫణిధరప్రసాద్‌కు అందజేశారు. అలాగే పర్చూరుకు చెందిన సుష్మ కుటుంబ సమేతంగా రూ.1,00,011, నెల్లూరుకు చెం దిన చెరుకూరి చెన్నప్పనాయుడు దంపతు లు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. విరాళాలను అందజేసిన దాతలను దేవ స్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.



అన్నప్రసాద వితరణ పథకానికి రూ.లక్ష విరాళం అందించిన దాత కేశవరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఏఈవో



సంక్షేమ బావుటా

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

ఉపాధి నిమిత్తం 20 ఏళ్ల క్రితం మేము తమిళనాడు నుంచి నంద్యాలకు వలస వచ్చాం. ఇప్పటి వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలా ఎవరూ ఆదుకో లేదు. నా భర్త ఇళయరాజ పదేళ్ల క్రితం మృతి చెం దారు. మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బూందీకారా తయారీ చేస్తూ కుటుం బాన్ని నెట్టుకొస్తున్నా. మరో ముగ్గురి మహిళలకు ఉపాధి కల్పించా. జగనన్న ప్రభుత్వం చిరు వ్యాపారులకు అండగా నిలిచింది. వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో రూ.60వేలు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.15 వేలు, జగనన్న తోడు కింద రూ.10 వేలు, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తక్కువ వడ్డీ కింద మరో రూ.40వేల రుణాన్ని ప్రభుత్వం మంజూరు చేసిం ది. వ్యాపార అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



చేయూతనందిస్తోంది. ప్రతి కుటుంబాన్ని ఆర్థికం గా ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కింది.

– నరయం తామర సెల్వి, జగజ్జననీ నగర్, నంద్యాల

పేదలకు పెద్ద కొడుకు జగన్ మోహన్‌రెడ్డి



మాది వ్యవసాయ కుటుంబం. మాకు రెండెకరాల పొలం ఉంది. నా భర్త గోవిందరెడ్డి 12 ఏళ్ల క్రితం మృతి చెం దాడు. గతంలో పొలం సాగు ద్వారా వచ్చే ఆదాయం ఇంటి అవసరాలకు సరిపోయేది కాదు. వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చడానికి నానా కష్టాలు పడే వాళ్లం. గత ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులను పట్టించుకునేది కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. రైతు భరోసా ద్వారా ఏటా రూ. 13,500 ప్రకారం ఇప్పటి వరకు రూ. 54,000 మాకు నగదు అందింది. ఈ బీసీ నేస్తం ద్వారా రూ. 15 వేలు అందుతోంది. ప్రతి నెల వితంతు ఫించన్ రూ. 3 వేలు వస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పెద్ద కొడుకుగా నిలిచి ఆదుకుంటు న్నాడు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనే సీఎం అవుతారు.

– సత్తిగారి లక్ష్మీదేవి, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ మండలం

'టెట్'కు సర్వం సిద్ధం

- నేటి నుంచి టెట్ ఆన్‌లైన్ పరీక్ష
- మార్చి 6వ తేదీ వరకు నిర్వహించేలా ఏర్పాట్లు
- జిల్లా వ్యాప్తంగా హాజరుకానున్న 7,675 మంది అభ్యర్థులు
- ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం విడతల్లో పరీక్ష

సాక్షి, నంద్యాల: టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్)కు సం బంధించిన ఏర్పాట్లను జిల్లా అధికారులు పూర్తి చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా మౌలిక సదుపాయాలు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే నాలుగు కేం ద్రాలను గుర్తించి ఏర్పాట్లను పూర్తి చేశారు. పొరపా ట్లకు తావివ్వకుండా, పకడ్బందీగా నిర్వహించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. జిల్లాలో ఆర్జీఎం, శాంతిరాం, ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలతో పాటు రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా టెట్ పరీక్ష రాసేందుకు 7,675 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం నుంచి మార్చి 6వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు విడుతల్లో పరీ క్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయా నికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఇప్పటికే విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు. పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. టెట్‌లో సాధించే మార్కులకు డీఎస్సీలో 20 శాతం వెయిటేజ్ కల్పించనున్న సంగతి తెలిసిందే.

ఏపీ టెట్ ముఖ్యమైన తేదీలు ....

ఫిబ్రవరి 7న రాష్ట్ర ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరి 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించారు. 19వ తేదీ నుంచి మాక్ టెస్టులు రాసేందుకు అవకాశం కల్పిం చారు. 23వ తేదీ నుంచి హాల్ టికెట్లను అభ్యర్థు లకు అందుబాటులో ఉంచారు. ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు ప్రతీ రోజు రెండు సెషన్స్‌లలో పరీక్ష నిర్వహిస్తారు. 10వ తేదీ ప్రాథమిక కీ విడుదల, ఆతర్వాత నాలుగైదు రోజుల్లోనే తుది ఫలితాలు విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

మాక్ టెస్ట్‌ల నిర్వహణ

టెట్ రాసే అభ్యర్థులు పరీక్ష విధానంతో పాటు పేపర్ మోడల్, మార్కుల కేటాయింపు, సమయం వివరా లను ప్రాక్టికల్‌గా తెలుసుకునేందుకు విద్యాశాఖ మాక్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఏపీటె ట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ప్రాక్టీస్ పరీక్ష రాసుకోవచ్చు. మాక్ టెస్ట్ రాయడం వల్ల ప్రశ్న పత్రాల నమూనాతో పాటు ఒక్కో ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో అభ్యర్థి తెలుసుకోవచ్చు. అభ్యర్థులకు సందేహాలుంటే 9505619127, 9705655349ను సంప్రదించవచ్చు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.సుధాకర్ రెడ్డి, వయోజన విద్య డైరెక్టర్ జి. గంగాభవాని పరి శీలించారు. పరీక్ష రాసే అభ్యర్థుల సందేహాల నివృ త్తి కోసం జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏమైన సమస్యలుంటే ఎం.మ హబూబ్‌బేగ్(9440360042), కే.కై సర్ అహ్మ ద్(8179855575), పి. లక్ష్మీ నారాయ ణ(9063660385) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 52 కేంద్రాలు
- 6 కేంద్రాలకు ప్రత్యేక రవాణా సదుపాయం
- పరీక్షలు రాయనున్న 28,399 మంది విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాం తంగా నిర్వహించేందుకు బోర్డు అధికారులు పకడ్బం దీ ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం పరీక్షలకు 13,553 మంది, ద్వితీయ సంవత్సరం పరీ క్షలకు 14,846 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. పరీక్షల నిర్వహణకు సిబ్బందిని నియమించ డంతో పాటు ఆయా కేంద్రాల్లో సదుపాయాల కల్ప నపై అధికారులు దృష్టి సారించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి కేంద్రంలో బెంచీలు, తాగునీటి, విద్యుత్ సదుపాయం కల్పిస్తు న్నారు. కేంద్రాల్లోని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి జోనల్, రాష్ట్ర స్థాయి ఇంటర్మీడియెట్ కార్యాలయం అధికారులు పర్యవేక్షణ చేసేందుకు లైవ్ స్ట్రీమ్ సదుపాయం కల్పిం చారు. జిల్లాలో 6 కేంద్రాలకు పరీక్షలు మొదలయ్యే సమయానికి రవాణా సదుపాయాలు లేకపోవడంతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులను ఏర్పాటు చేయనున్నారు. నొస్సం, అవుకు, బనగానపల్లె, ఆళ్ల గడ్డ, కోవెలకుంట్ల జాతీయ రహదారి వెంట ఉన్న కళాశాల పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన జూని యర్ కళాశాలలు 152 ఉన్నాయి. వీటిలో 52 కేం ద్రాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఇం దులో పాములపాడు, కొలిమిగుండ్ల, అవుకు, చాగలమర్రిలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. పరీక్ష సమయంలో ఈ కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీ క్షలు జరుగుతున్న సమయంలో కరెంటు సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకునేలా సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులు సూచనలు చేశారు. గంట ముందు గానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

అమ్మలా లాలన.. అధునాతన బోధన

- అభాగ్యులకు అండగా నిలిచిన కస్తూర్బాగాంధీ విద్యాలయం
- నాడు– నేడుతో విద్యాలయంలో సకల సదుపాయాలు
- విద్యార్థినుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ



విద్యార్థినులకు డిజిటల్ పద్ధతిలో గణితాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ఓర్వకల్లు: తల్లిలేని వారు కొందరైతే.. తండ్రిలేని వారు మరికొందరు. తల్లితండ్రులకు దూరమైన వారు ఇంకొందరు.. వీరందరికీ ఓర్వకల్లు కస్తూర్బా గాంధీ విద్యాలయం ఆశ్రయం కల్పిస్తోంది. ఈ విద్యాలయంలో పనిచేసే సిబ్బంది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. బాలికలకు ఏలోటూ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించింది. విద్యాలయానికి ఆధునాతన బోధన పరికరాలను అందించింది. 2019కు ముందులో పాఠశాలలో తాగునీటి వసతి ఉండేది కాదు. విద్యుత్ సమస్యలతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మనబడి–నాడునేడుతో పాఠశాల రూపురేఖలను మార్చేసింది. ప్రతి గదిలో విద్యుత్ సదుపాయం కల్పించారు. ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఎల్‌ఈడీ బల్బులు, చార్జింగ్ లైట్లు అమర్చారు. పాఠశాలలో అన్ని తరగతి గదులలో డెస్కులు, గ్రీన్‌బోర్డులను ఏర్పాటు చేశారు.

ఆంగ్ల మాధ్యమంలో బోధన

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన అందుతోంది. పాఠశాలలో మొత్తం 17గదులు ఉండగా.. అందులో 10 గదులలో హాస్టల్, ఆఫీస్, స్టాఫ్ కోసం కేటాయించగా, మిగతా 7 గదులలో తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 232మంది ఆశ్రమం పొందుతున్నారు.

ఎల్‌ఈడీ టీవీల ఏర్పాటు

గ్రామీణ విద్యార్థినులకు సైతం మెరుగైన వసతులతో పాటు భవిష్యత్తు తరాలను దృష్టిపెట్టుకొని సాంకేతతో కూడిన డిజిటల్ విద్యాబోధనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం పాఠశాలలో నాలుగు ఎల్‌ఈడీ టీవీలను అమర్చారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులను డిజిటల్ రూపంలోనే బోధిస్తున్నారు. తద్వారా విద్యార్థినులలో సాంకేతిక విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు దోహదపడుతోంది.



బాలికకు మందులు ఇస్తున్న ఆరోగ్య కార్యకర్త

నాణ్యమైన భోజనం

విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనవసతి కల్పిస్తున్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం అన్నం, పప్పు, సాంబారు, పండు, సాయంత్రం అన్నం, ఆకుకూరలు, కూరగాయలు, చిక్కిళ్లతో పాటు, గుడ్లు, స్నాక్స్ వంటి పౌష్టికాహారం అందిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా స్నానపు గదులు, మరుగుదొడ్లు సమకూర్చారు.



పాఠశాల లోపలి ప్రాంగణం

సౌకర్యాలు బాగున్నాయి



మాది మంత్రాలయం. అమ్మ భీమక్కను నాన్న వదిలేశాడు. కర్నూలు నగరంలోని ఎన్‌టీఆర్ బిల్డింగ్‌లో నివాసం ఉంటూ కూలి పనులు చేస్తూ అమ్మ నన్ను చదివించేది. నేను ఐదో తరగతిలో ఉండగా అమ్మ అనారోగ్యంతో చనిపోయింది. ఆదుకునేవారు లేకపోవడంతో ఉపాధ్యాయుల చొరవతో బాలికా సంరక్షణ అధికారులకు అప్పగించారు. వారు ఓర్వకల్లు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6వ తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం నేను 9వ తరగతి చదువుతున్నా. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వింటున్నా. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నా. రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ప్రతిభ చాటాను. ఇక్కడ సౌకర్యాలు చాలా బాగున్నాయి. –రామలక్ష్మి

ఇంగ్లిష్ మీడియం చదువుతున్నా



మేం నూనెపల్లెలో నివాసం ఉండేవాళ్ల. అమ్మ ఉమాదేవి, నాన్న సుంకన్న ఇద్దరూ కూలి పనులకు వెళ్లేవారు. నాన్న సుంకన్న తాగుడు బానిసై అమ్మను వేధించేవాడు. అమ్మ రెండో సంతానంగా మగబిడ్డకు పుడితే నాన్న ఇతరులకు అమ్మేశాడు. ఆ బెంగతో అమ్మ అనారోగ్యానికి గురై చనిపోయింది. అప్పటి నుంచి మా మేనమామ రామాంజనేయులు వద్ద ఉండేదాన్ని. వారు కూడా పోషణభారమైందని నన్ను బాలికా శిశు సంరక్షణ అధికారులకు అప్పగించారు. వారు తీసుకొచ్చి కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం 8వ తరగతి ఇంగ్లిష్ మీడియం చదువుతున్నాను. దాతలు సహకరిస్తే ఉన్నత చదువులు చదివి పేదలకు సాయం చేయాలని ఉంది. –బి.నాగమ్మ

అనాథ పిల్లలకు సేవ చేస్తా



మాది మహానంది. అమ్మ శిరీష, నాన్న బుజ్జి. ఇద్దరు కూలిపనులు చేస్తూ జీవించేవారు. మద్యానికి బానిసైన నాన్న ఒక రోజు అమ్మతో గొడవపడి తలపై గుండ్రాయితో మోదాడు. దీంతో నా అనేవారు లేకపోవడంతో నంద్యాల పట్టణంలో భిక్షాటన చేస్తూ బతికేదాన్ని. నా పరిస్థితిని గమనించిన పోలీసులు పెద్దపాడు అనాథ బాలికల వసతి గృహంలో చేర్పించారు. అక్కడ ఐదో తరగతి పూర్తి చేశాను. వారు ఓర్వకల్లు కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం 8వ తరగతి ఇంగ్లిష్ మీడియం చదువుతున్నాను. ఉన్నత చదువులు చదివి అనాథ పిల్లలకు సేవ చేయాలని ఉంది. – విజయలక్ష్మి

క్లుప్తంగా

ఎఫ్‌పీవోలకు విత్తనోత్పత్తి అవకాశం

- నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఏరియా మేనేజర్ కేశవమూర్తి



మాట్లాడుతున్న కేశవమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు(ఎఫ్‌పీవోలకు) విత్తనోత్పత్తి చేసే అవకాశం కల్పిస్తామని నేషనల్ సీడ్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌సీ) ఏరియా మేనేజర్ డాక్టర్ కేశవమూర్తి తెలిపారు. స్థానిక కొత్త బస్టాండు సమీపంలోని ఒక హోటల్ సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేషనల్ సీడ్ కార్పొరేషన్ మినుములు, పెసలు, కందులు, శనగలు, మొక్కజొన్న, జొన్న, సజ్జ తదితర విత్తనాలను ఉత్పత్తి చేస్తోందన్నారు. ఈ విత్తనాలను పంపిణీ చేసేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను డీలర్లుగా నియమిస్తామని పేర్కొన్నారు. ఎఫ్‌పీవోలకు విత్తనాలను 15 నుంచి 20 శాతం వరకు రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు. విత్తనోత్పత్తికి ముందుకు వచ్చే ఎఫ్‌పీవోలకు బ్రీడర్, ఫౌండేషన్ సీడ్ ఇస్తామని పేర్కొన్నారు. ఉత్పత్తి చేసిన విత్తనాలను ఎన్‌ఎస్‌సీనే కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు, కల్లూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎన్‌ఎస్‌సీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ అఖిల్ దేవ్, జూనియర్ ఆఫీసర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

2న జిల్లా మహిళా హాకీ జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): నంద్యాల పట్టణంలోని ఎస్‌పీజీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వచ్చే నెల 2వ తేదీన జిల్లా మహిళా హాకీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో ప్రవేశ రుసుం రూ.10 చెల్లించి ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు మార్చి నెల 8 నుంచి 11 వరకు ప్రకాశం జిల్లాలో నిర్వహించనున్న 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ మహిళల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9966565317 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తండ్రి మందలించాడని..

సంజామల: వసంతాపురం గ్రామానికి చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన మేకల రామ్మోహన్ చిన్న కూమార్తె అమృత (19) పదవ తరగతి పూర్తి చేసి ఇంటి దగ్గర ఉంటోంది. ప్రతి రోజు సెల్ ఫోన్ ఎక్కువ ఉపయోగిస్తుందని తల్లిదండ్రులు తరుచుగా మందలించే వారు. ఈనెల 24వ తేదీన మరో మారు తండ్రి రామ్మోహన్ మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరు కుంది. వెంటనే కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు వాహనాల వేలం

కర్నూలు: మద్యం, సారాతో పాటు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన కేసుల్లో 40 వాహనాలను కార్యాలయంలో ఈనెల 28న వేలం వేయనున్నట్లు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, వాటిని బహిరంగ వేలం వేస్తామన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ భూమిలో గుడారాలు తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు పరిధిలోని సర్వే నంబర్ 341లోని 34.06 ఎకరాలను ఆక్రమించుకోవడానికి చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన చిన్న లక్ష్మన్న ఆధ్వర్యంలో కొందరు యువకులు స్పందనలో ఫిర్యాదు చేశారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'టీజీ.. గూడుపుఠాణి' కథనంపై వారు స్పందించారు. వెంటనే ఆక్రమణదారులు వేసిన గుడారాలు తొలగించాలన్నారు. లేకపోతే తామే రంగంలోకి దిగాల్సి వస్తుందన్నారు. తమ గ్రామ పరిధిలోని భూములను ఇతరులు వచ్చి ఎలా ఆక్రమిస్తారని ప్రశ్నించారు. తమ గ్రామంలో పేదలకు అక్కడ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా.. చేనేత కార్మికల పెన్షన్లకు శాపంగా మారిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామాంజనేయులు డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జగనన్నకు చెబుదాం–స్పందనలో భాగంగా జిల్లా అధికారులతో కలసి డీఆర్వో ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు నాగప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు.

గ్రానైట్ రాయిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



గోరంట్ల వద్ద తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రానైట్‌రాయిని అక్రమంగా తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం కోడుమూరు మండలం గోరంట్ల వద్ద సర్వే నంబర్ 487లో అక్రమంగా గ్రానైట్‌రాయిని తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వెల్దుర్తి మండలం పుట్లూరు గ్రామంలో నిర్మిస్తున్న మారెమ్మ ఆలయానికి సంబంధించి పునాదుల నిర్మాణానికి గ్రానైట్ రాయిని తరలిస్తున్నట్లు విచారణలో తేల్చినట్లు జిల్లా మైనింగ్ డీడీ తెలిపారు. ఒక హిటాచీని సీజ్ చేసి స్థానిక వీఆర్‌ఓకు అప్పగించామన్నారు.

శ్రీశైలంలో ఏసీబీ అధికారుల తనిఖీ

- గతంలో జరిగిన ఇంజినీరింగ్ పనుల పరిశీలన



శ్రీశైల క్షేత్రంలో గతంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు కొలతలు వేస్తున్న ఏసీబీ బృందం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో మరోసారి ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. సోమవారం ఏసీబీ సీఐ వంశీనాథ్ నేతృత్వంలో డీఈ రాజేంద్రనాథ్ రెడ్డి, ఏఈ, ఇంజనీరింగ్ అధికారుల బృందం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గతంలో శ్రీశైల దేవస్థానంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఏసీబీ అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికే మూడు సార్లు తనిఖీలు చేపట్టిన అధికారులు సోమవారం ఔటర్ రింగ్‌రోడ్డు, పుష్కరిణి, మాఢవీధులు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. రోడ్డు పొడవు, వెడల్పులను కొలతలు వేసి రికార్డు చేశారు. అలాగే ఆయా పనుల నాణ్యత కో సం టెస్టింగ్ శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపుతున్నారు. మంగళవారం ఆయా పనులకు సంబంధించిన ఎం బుక్ రికార్డులను పరిశీలించనున్నారు. టెండరింగ్ విధానం ఎలా నిర్వహించారనే విషయాలను ఆరా తీయనున్నారు. ఏసీబీ అధికారులకు దేవస్థానంలో గతంలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేస్తున్నామని, నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని ఏసీబీ సీఐ వంశీనాథ్ తెలిపారు.

బంగారు, వెండి సామగ్రి విరాళం



బంగారం, వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి సోమవారం అమెరికాకు చెందిన కొత్తపల్లి సునీల్ దత్, కుటుంబ సభ్యులు బంగారం, వెండి సామాగ్రిని బహుకరించారు. అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు పి.మార్కండేయశాస్త్రి, అధ్యాపక ఎం.పూర్ణానందం, ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జున లకు బంగారం, వెండి వస్తువులను అందజేశారు. వీటిలో 28.300 గ్రాముల బరువైన 2 బంగారు భాషికాలు, 5 గ్రాముల బంగారు కంకణం అందజేశారు. అలాగే 1.25 కేజీ వెండి పళ్లెం, 865 గ్రాముల వెండి పళ్లెం, 550 గ్రాముల వెండి నాగహారతి, 290 గ్రాముల వెండి శక్తి ఆయుధం, 420 గ్రాముల కుక్కుటధ్వజం, 750 గ్రాముల 5 వెండి గిన్నెలు, 920 గ్రాముల గంధాక్షత గిన్నె, 190 గ్రాముల వెండి కమండాలం, 300 గ్రాముల కమండలాన్ని (పెద్దది) విరాళంగా అందజేశారు. అలాగే నంద్యాల జిల్లా పగిద్యాలకు చెందిన కొలూరి సింధూర 810 గ్రాముల వెండి పళ్లెం, 350గ్రాముల వెండి పళ్లెం, 615 గ్రాముల మూడు వెండి చెంబులను విరాళంగా సమర్పించారు. విరాళాలు సమర్పించిన దాతలకు దేవస్థానం తరుపున స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

పుట్టినింటికి వెళ్తూ విషాదం!

ఎద్దులబండిని ఢీకొన్న బైక్

- ఓ వ్యక్తి, ఇద్దరు బాలికలు మృతి
- చిన్నారుల తల్లికి తీవ్ర గాయాలు
- బళ్లారి జిల్లాలో దుర్ఘటన
- తల్లీకూతుళ్లు ఆలూరు మండలవాసులు



ఘటనాస్థలిలో చిన్నారుల మృతదేహాలు

సాక్షి, బళ్లారి: పుట్టినింట్లో ఒడిబియ్యం నింపుకొని మెట్టినింటికి తెలిసిన వ్యక్తి బైక్ మీద తల్లీకూతుళ్లు బయల్దేరారు. అదే వారి చివరి ప్రయాణమైంది. ఆ బైక్ ఎద్దుల బండిని ఢీకొని ఆ వ్యక్తి, ఇద్దరు బాలికలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ దుర్ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బళ్లారి జిల్లాలోని దరోజీ సమీపంలో ఎద్దుల బండిని బైక్ ఢీకొన్న ఘటనలో వెంకటేష్(45), ఆశ(9), అఖిల(6) మరణించారు.

ఊరికి వెళ్తున్నానడంతో..

జంబక్క పొరుగున ఏపీలోని కర్నూలు జిల్లా ఆలూరు సమీపంలోని అరికెర గ్రామంలో పుట్టింట్లో ఒడిబియ్యం నింపుకొని కూతుళ్లతో కలిసి బళ్లారికి బస్సులో వచ్చారు. అక్కడ జంబునాథహళ్లికి చెందిన వెంకటేష్ కనిపించడంతో ఊరికి వెళుతున్నానని, మీరూ రావచ్చని జంబక్కకు చెప్పాడు. తెలిసిన వ్యక్తి కదా, ఒకే ఊరు అని అతని బైక్‌లో తల్లీ పిల్లలు ఎక్కారు. జంబక్క, చిన్నారులను తీసుకుని ద్విచక్ర వాహనంలో విజయనగర జిల్లా హొసపేటె తాలూకా జంబునాథహళ్లికి బైక్ మీద బయల్దేరారు. మార్గమధ్యంలో దరోజీ దగ్గర నిలబడిన ఎద్దుల బండిని వెంకటేష్ అదుపుతప్పి ఢీకొన్నాడు. అందరూ దూరంగా ఎగిరిపడ్డారు. వెంకటేష్, పిల్లలు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనలో జంబక్కకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కుడితిని పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

ఏపీ శాప్ నెట్‌వర్క్ సేవలను విస్తృతం చేస్తాం

- నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాచాని వెంకటేష్

ఎమ్మిగనూరుటౌన్: సొసైటీ ఫర్ ఆంధ్రప్రదేశ్ నెట్‌వర్క్(ఎస్‌ఏపీ ఎన్‌ఈటీ) సేవలను విస్తృతం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ మాచాని వెంకటేష్ తెలిపారు. విజయవాడలోని ఏపీ శాప్ నెట్‌వర్క్ కార్యాలయంలో సోమవారం ఆయన నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో శాప్‌నెట్ వర్క్ సీఈఓ ప్రజ్ఞాధర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సీఈఓతో పాటు ఈడీ మోతీలాల్ నాయక్, సంస్థ సిబ్బంది శాలువాతో మాచాని వెంకటేష్‌ను సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు రాష్ట్ర స్థాయిలో చైర్మన్ పదవి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వార్డెన్ కొడుతోంది.. చంపేస్తానంటోంది!

- స్పందనలో విద్యార్థిని ఫిర్యాదు



స్పందనకు ఫిర్యాదుతో వచ్చిన విద్యార్థిని కరిష్మ

కర్నూలు(సెంట్రల్): పెద్దపాడులోని అనాథ ఆశ్రమం హాస్టల్ వార్డెన్ తరచూ తనను కొడుతోందని, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరిస్తోందని నాలుగో తరగతి చదువుతున్న కరిష్మ అనే బాలిక ఫిర్యాదు చేసింది. సోమలగూడూరుకు చెందిన ఈ బాలిక సోమవారం తన అమ్మమ్మతో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమానికి వచ్చింది. అనాథాశ్రమంలో 24 మంది పిల్లలు ఉన్నారని, వారితో అంట్లు తోమించడం, దుస్తులు ఉతికించడం వంటి పనులు చేయిస్తున్నారని ఆరోపించింది. సొంత పనులు చేయించుకునేందుకు చిన్నారులను ఇళ్లకు తీసుకెళ్తున్నారని, లోపల జరిగే విషయాలు బయటకు చెబితే చంపేస్తామని భయపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. వార్డెన్‌కు భయపడి ముగ్గురు పిల్లలు బడి మానుకున్నారని, తనను వేరే హాస్టల్‌కు పంపాలని, లేకపోతే తాను చదువుకోలేనని స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేసింది. నాలుగేళ్ల క్రితం తల్లి మరణించడంతో అమ్మమ్మ తనను పెద్దపాడు అనాథాశ్రమంలో ఉంచిందని ఆ బాలిక విలేకరులకు తెలిపింది.

గోపురం వెలసింది.. శాపం వీడింది

- లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ
- రూ.1.52 కోట్లతో రాజ గోపురం నిర్మాణం పూర్తి
- నేటి నుంచి ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు
- వీడనున్న మిడుతూరుకు ఉన్న శాపం



శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం

మిడ్తూరు: ప్రతి ఊరికి చరిత్రతో పాటు ప్రత్యేకతలు, విశేషాలు తప్పక ఉంటాయి. నంద్యాల జిల్లాలోని మండల కేంద్రమైన మిడ్తూరులో దశాబ్దాలుగా విచిత్రమైన ఆచారం కొనసాగుతోంది. ఆ ఆచారం శాపంగా మారి గ్రామాభివృద్ధికి అవరోధంగా నిలిచింది. పూర్వం నుంచి కొనసాగుతున్న ఈ శాపం ఎట్టకేలకు వీడుతుండటంతో గ్రామస్తుల్లో ఆనందం నెలకొంది. గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం 108 తిరుపతులలో ఒకటిగా ప్రసిద్ధిగాంచినది. వందల ఏళ్ల క్రితం చంద్ర వంశపు చివరి రాజైన జనమే జయ మహారాజు స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, ఆలయ ముఖ మండపం, తలంబ్రాల మండపం, చుట్టూ ప్రాకారం, శ్రీకృష్ణదేవరాయల సోదరుడైన సదాశివరాయలు నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. కాగా ఆలయ నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఆలయానికి గాలిగోపురం లేకపోవడంతో వందల ఏళ్లుగా గ్రామంలో మేడి మిద్దల నిర్మాణం, మామిడి చెట్లు ఉండవని.. ఉన్నా ఎవరూ వృద్ధిలోకి రారని కొన్ని దశాబ్దాలుగా ప్రచారంలో ఉంది. దీంతో గ్రామంలో ఎవరూ ఇంటిపై ఇల్లు కట్టరు. ఐదారుగురు ధైర్యం చేసి నిర్మించుకున్నా ఆర్థికంగా నష్టపోవడంతో ఇల్లు వీడటం జరిగింది. అలాగే పోలీసు క్వార్టర్స్ నిర్మాణం చేపట్టినా ఎవరూ నివాసం ఉండక పోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఆలయానికి గాలిగోపుర నిర్మాణం చేపడితేనే గ్రామాభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు ఆశించినా ఆ దిశగా ఎవరూ ప్రయత్నాలు చేయలేదు. ఏళ్ల తరబడి గత పాలకులు ఈ విషయంపై దృష్టి సారించలేక పోయారు. వందల ఎకరాలు మాన్యం భూములు ఉన్నప్పటికీ నామమాత్రంగా స్వామి వారికి కైంకర్యాలు, బ్రహ్మోత్సవాలతో సరిపెట్టారు.


టీటీడీ సహకారం.. గ్రామస్తుల కల సాకారం

దశాబ్దాలుగా తర్వాత గ్రామానికి ఉన్న శాపం వీడేలా టీటీడీ సహకారమందించడంతో ఎట్టకేలకు గ్రామస్తుల కల సాకారమవుతోంది. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామిరెడ్డి చొరవతో గ్రామస్తులందరూ ఒక్కటై 2020లో ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. గ్రామస్తులు రూ.38 లక్షల విరాళాలు సేకరించి ఆ మొత్తాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) చెల్లించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి సహకారంతో చెన్నకేశవ స్వామి ఆలయ గాలిగోపుర నిర్మాణానికి అభివృద్ధి పనులకు టీటీడీ నుంచి రూ.1.52 కోట్లు మంజూరయ్యాయి. మూడేళ్లుగా కొనసాగుతున్న ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి కావచ్చాయి. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు వేదమంత్రోచ్చారణాల మధ్య నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ఆలయ రాజ గోపురాన్ని నిర్మించిన దృశ్యం

పురాతన చరిత్ర కలిగిన ఆలయం



తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే స్వామి వారి కైంకర్యాలు పురాతన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్వహించాల్సి ఉంది. ఏటా ఉగాది పర్వదినాన సూర్యకిరణాలు స్వామి వారి పాదాలను తాకడం ఈ ఆలయ ప్రత్యేకత. ఇంతటి విశిష్టత కలిగిన ఈ ఆలయానికి గాలిగోపురం నిర్మాణం పూర్తి కావడంతో ఇక మహర్దశ పట్టనుంది. ఈ నెల 29 తేదీన ఆలయ శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. – శ్రీ దత్త ఆశ్రమ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు

చాలా ఆనందంగా ఉంది



వందల ఏళ్లుగా కలగానే మిగిలిన గాలిగోపుర నిర్మాణం ఎట్టకేలకు పూర్తి కావడంతో చాలా ఆనందంగా ఉంది. గ్రామస్తుల సహకారం ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి చొరవతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి టీటీడీ నిధులను వెచ్చించడంతో ఆలయ గాలిగోపుర నిర్మాణం పూర్తయింది. గ్రామాభివృద్ధికి అడ్డుగా ఉన్న శాపం వీడనుంది. – తువ్వా శివరామక్రిష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్

నెరవేరిన కల



మాతాత కాలం నుంచి ఆలయానికి గాలిగోపురం లేకపోవడంతో ఆలయానికి ఎంతో వెలతిగా ఉండేది. గ్రామంలో మేడి మిద్దలు నిర్మాణం చేపడితే ఆ కుటుంబాలు వృద్ధిలోకి రాని పరిస్థితి ఉంది. ప్రస్తుతం నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులకు ఇక భయం ఉండదు. – భూమా క్రిష్ణమోహన్